
ప్రజాశక్తి

సోమవారం 8 జులై 2024

5

విజయనగరం





కారు వద్ద ఫొటోలు దిగుతున్న జనం

రామనారాయణంలో 'బుజ్జి' సందడి

కల్కి సినిమా కోసం ప్రత్యేకంగా తయారు చేసిన కారు (బుజ్జి) ఆదివారం స్థానిక రామ నారాయణంలో సందడి చేసింది. కల్కి సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం నగర సమీపంలోని రామనారాయణంలో ఆ కారును ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ కారును తిలకించేందుకు భారీగా సందర్శకులు తరలివచ్చారు. 'బుజ్జి'తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. -ప్రజాశక్తి, విజయనగరం కోట



ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతకు అన్ని రంగాల్లోనూ వంచన ఎదురవుతుంది. అన్ని విధాలుగా మోసపోతూ అధిక పెట్టుబడులు పెట్టి పంట నష్టాల్లో అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్న రైతన్నను ఆదుకొనేది ఎవరనేది ప్రశ్నార్థకమవుతోంది. కేవలం విత్తనాలే కాకుండా పురుగుమందులు, రసాయన ఎరువులు, గుళికలు వంటి వాటిని కూడా కల్తీ చేస్తూ నాసిరకం, కాలం చెల్లిన సరుకుల అమ్మకాలు చేస్తూ రైతును మోసం చేస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం వ్యాపారుల నుంచి మామూల్లు తీసుకొని తూతూ మంత్రపు తనిఖీలతో మమా అనిపించి ఇబ్బుడు ముబ్బడిగా లైసెన్స్‌లు మంజూరు చేస్తూ క్లీన్ చిట్‌లు ఇచ్చేస్తున్నారు.

అన్నదాతకు వంచన

- నాసిరకం సరుకులు, ఆపై వర్షాభావంతో నష్టాలు
- మామ్ముళ్ల మత్తులో కొరవడిన అధికారుల తనిఖీలు
- విజిలెన్స్ దాడులతో తేటతెల్లమైన నకిలీలు

ప్రజాశక్తి - రామభద్రపురం

రామభద్రపురంలోని శ్రీవాసవి ఫెర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్‌లో ఇటీవల స్థానిక వ్యవసాయ అధికారులు తనిఖీలు జరిపి అన్ని సక్రమంగానే ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ఈ నెల 5న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదే షాపులో జరిపిన దాడుల్లో సుమారు రూ.10 లక్షలకు పైబడిన సరుకులు నాణ్యత లేనివని, కల్తీవని గుర్తించి సరుకులు సీజ్ చేసి షాపుకు సీల్ వేయడం గమనార్హం. ఒకే షాపులో తనిఖీలు చేసినప్పటికీ స్థానిక అధికారులు అంతా బాగానే ఉందని చెప్పడం, బయట నుంచి వచ్చిన అధికారులు లోపం ఉందని చెప్పడం చర్చనీయాంశమైంది. కేవలం స్థానిక అధికారులు కాసులకు కక్కుర్తి పడి రైతులను మోసగిస్తున్న వ్యాపారులతో చేతులు కలిపి అంతా బాగానే ఉందని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

మండలంలో కల్తీ విత్తనాలు, ఎరువులను అధికారులు గుర్తించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత వరకూ విత్తనాలు నాటకపోతే ప్రకృతి సహకరించలేదని, తెగుళ్ళు కనుమరుగవ్వకపోతే పురుగు ప్రభావం ఎక్కువుగా ఉందని భావించామే తప్ప ఇలా వ్యాపారులు మోసం చేస్తున్నారని అనుకోలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా నష్టాలే తప్ప లాభాలు రావడం లేదని, కనీసం పెట్టుబడి దక్కినా చాలనే భావనలో తప్పని పరిస్థితుల్లో వ్యవసాయం చేస్తున్నామని మరి కొంత మంది రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

అన్ని షాపుల్లోనూ ఇదే పరిస్థితి?

మండలంలో రైతన్నకు ఇంత అన్యాయం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఈ షాపులోనే కాదు అన్నింటా ఇదే తంతు నడుస్తుందని అధికారులకు లంచాలు ఇస్తూ ఇలా మేనేజ్ చేస్తూ అన్నదాతను మోసం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా అంతటికీ సుమారు ఇక్కడి నుంచే రైతులు కూరగాయ, ఉద్యానవన పంటలు పండిచి తరలిస్తుంటారు. ఇప్పుడు ఇలాంటి పంటలకు సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు కల్తీవి, నాణ్యత లేనివని తేలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ బృందం (ఫైల్)

రశీదులివ్వని వ్యాపారులు

మండల కేంద్రంలో సుమారు 12 ఎరువులు, విత్తనాల దుకాణాలున్నాయి. ఏ దుకాణంలో సరుకు కొనినా వ్యాపారులు రసీదులు ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లకు రైతాంగం ఒకేసారి వెళ్ళడంతో సరుకు అదును మీద కొనేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్పా వాటి నాణ్యత చూసే పరిస్థితి లేకుండా పోతుందని దీన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు నాణ్యత లేనివి అంట గడుతున్నారని వాపోతున్నారు. స్టాక్ రిజిష్టర్ లేకుండానే అమ్మకాల్లో రసీదులు ఇవ్వకుండానే ఇలా నాణ్యత కొరవడిన సరుకులు విక్రయిస్తున్నా, లైసెన్స్ వివరాలు కూడా సక్రమంగా లేకపోయినా అధికార యంత్రాంగం ఎలా అనుమతులు ఇస్తున్నారని బహిరంగ చర్చ జరుగుతుంది. దూర ప్రాంతం నుంచి వచ్చే విజిలెన్స్ యంత్రాంగం తనిఖీల్లో తప్పా. స్థానిక యంత్రాంగం ఏ వ్యాపారిపై కూడా కేసులు నమోదు చేసే దాఖలాలు లేవు. దీన్ని అలుసుగా చేసుకొని వ్యాపారులు కూడా గుట్టుగా అక్రమ వ్యాపారం విస్తరిస్తూ అన్నదాతకు ఆర్థిక నష్టాన్ని మిగుల్చుతున్నారు. ఇకనైనా సంబధిత శాఖాధికారులు నిరంతర తనిఖీలు ముమ్మరం చేసి నకిలీల బెడద నుంచి అన్నదాతకు ఉపశమనం కలిగించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అంబేద్కర్‌పై ఎన్నో ఆశలు

- జిల్లా అభివృద్ధికి వ్యవసాయ అనుబంధ రంగాలే కీలకం
- కొదవ లేనన్ని నదులు, గెడ్డలు
- ప్రతిపాదనలకే పరిమితమైన మినీ జలాశయాలు
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఎన్నో అవకాశాలు
- పర్యాటకరంగ అభివృద్ధికి అపార వనరులు

విజయనగరం... ఈ పేరు వినగానే వెనుకబాటు తనం, వర్షాధార పంటలు, వలసలు, అత్యంత చిన్న జిల్లా... ఇటువంటి విషయాలు గుర్తుకొస్తాయి. కానీ, ఇదంతా ఒకప్పటి మాట. జిల్లాల పునర్విభజన అనంతరం విజయనగరం పెద్ద జిల్లాల సరసన చేరింది. ఉపాధి హామీ పనులతో వలస కుటుంబాల సంఖ్య కొంతలో కొంతైనా తగ్గింది. వెనుకబాటు తనం నుంచి ఇప్పుడిప్పుడు గట్టెక్కుతోంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో 81.33 శాతం ఓటింగ్‌తో రాజకీయ చైతన్యం ప్రదర్శించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మనసుపెడితే ప్రగతి దారులే. అందుకు అవసరమైన వనరులు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయి. అంతకు మించి కష్టపడి పనిచేసే మనస్థత్వం గల ప్రజానీకం ఉంది. ఈ నేపథ్యంలో కొత్త కలెక్టర్‌పై జిల్లా ప్రజానీకం ఆశలు పెరుగుతున్నాయి.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వ్యవసాయ రంగం అత్యంత కీలకమైనది. 80 శాతం ప్రజానీకం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, అందుకు తగ్గట్టు సాగునీటి ప్రాజెక్టులు లేవు. ఉన్న కొన్ని జలాశయాలు దశాబ్దాలు తరబడి అసంపూర్తిగా ఉన్నాయి. ముఖ్యంగా తోటపల్లి జలాశయం లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించలేకపోతోంది. చంపావతి, వేగావతి, గోస్తనీ, నాగావళి వంటి ఎన్నో నదులు ఉన్నాయి. వీటిపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. ఆండ్ర, పెద్దగెడ్డ, తాటిపూడి తదితర జలాశయాలు ఆధునికీకరణ నత్తనడకన సాగడం వల్ల శివారు ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. గుర్లగెడ్డ అసంపూర్తిగా ఉండిపోయింది. ఏడొంపుల గెడ్డ, పోతుల గెడ్డ వంటి ఎన్నో జీవ గెడ్డలు జిల్లాలో ఉన్నాయి. వీటన్నింటిపైనా పలు చోట్ల చిన్నచిన్న చెక్‌డ్యాములు నిర్మించినా సాగునీరు పుష్కలమే. వీటిపై పెద్దగా దృష్టిపెట్టకపోవడం వల్ల పంటలన్నీ వర్షాధారంగానే సాగుచేయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. దీంతో, వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ.13,343 కోట్ల (41.2 శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతోపాటు వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులపైనా పడుతోంది. అయినా, నేలతల్లిని నమ్ముకున్న రైతులంతా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, అరటి, మినుములు, పెసలు, తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు సాగుచేస్తూ బతుకీడుస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కూరగాయలు, పువ్వులు కూడా విస్తారంగా సాగవుతున్నాయి. మామిడి సాగులో రాష్ట్రంలో మన జిల్లా మూడో స్థానంలో ఉంది. వీటన్నింటికీ మార్కెట్ సదుపాయాలు లేకపోవడంతో రైతులు దళారుల బారినపడక తప్పడం లేదు.

పారిశ్రామికాభివృద్ధికి ఎన్నో అవకాశాలు

ఒకప్పుడు జ్యూట్ మిల్లులకు విజయనగరం జిల్లా పెట్టింది పేరు. 20 మిల్లుల వరకు ఉండేవి. ప్రభుత్వ విధానాల వల్ల జిల్లాలో ప్రస్తుతం రెండే నడుస్తున్నాయి. కొద్దిరోజుల క్రితమే జిల్లాలోని అతిపెద్దదిగా పిలవబడే నెల్లిమర్ల జ్యూట్ మిల్లు మరోసారి మూతపడింది. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గవేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాలవారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 2017-18లో 19.3 శాతం కాగా, 2018-19లో 17.6 శాతానికి తగ్గింది. 2019-20 నాటికి అది 15.9 శాతానికి పడిపోయింది. ఆ తరువాత కాలం నుంచి కూడా పారిశ్రామికరంగం ద్వారా వస్తున్న ఆదాయం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పారిశ్రామికాభివృద్ధికి చొరవ చూపాల్సి ఉంది. కలెక్టర్‌గా పెద్ద పరిశ్రమలు పెట్టేందుకు అవకాశం లేకపోవచ్చు. పంటల ప్రాధాన్యతలను బట్టి ఆయా ప్రాంతాల్లో కలెక్టర్ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు నిరుద్యోగ సమస్యను అధిగమించవచ్చు. ముఖ్యంగా రైసు మిల్లులు, నూనె, క్రషింగ్, మామిడి ఉత్పత్తులతో జ్యూస్, తాండ్ర, ఆవకాయ తదితర సూక్ష్మ, చిన్నతరహా యూనిట్లు, మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్లు, చేపలపెంపకం, పాడి సంపద, కోళ్లపెంపకం, పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చు. తద్వారా వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలకు మార్కెట్, మద్దతు ధర కల్పించేందుకు అవకాశం కలగడంతోపాటు ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరిగేందుకు దోహదపడుతుంది.

పర్యాటకాభివృద్ధికి వనరులెన్నో

ఓవైపు అలల తాకిడితో, వయ్యారపు కెరటాలతో మనసును దోచే సముద్ర తీరం, మరోవైపు కోకిల కిలకిలరావాలతో మానసిక ప్రాంతతకు మారుపేరుగా నిలుస్తున్న గిరిజన ప్రాంతం, గంటస్తంభం, కోట, రామతీర్థం వంటి పురాతన, ఆధ్యాత్మిక కట్టడాలతో పట్టణ, మైదాన ప్రాంతాలు జిల్లాలో ఉన్నాయి. ముఖ్యంగా తాటిపూడి, ఆండ్ర తదితర జలాశయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా చింతపల్లి బీచ్‌ను పర్యాటక హబ్‌గా రూపుదిద్దేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. పర్యాటకుల సౌకర్యార్థం ఇప్పటికే అక్కడ రిసార్ట్ ఏర్పాటుచేశారు. ఆ దరిదాపుల్లోని లైట్ హౌస్ రారమ్మంటున్నట్టుగా కనిపిస్తుంది. గతంతో పోలిస్తే జిల్లాకు రోడ్డు కనెక్టివిటీ, కమ్యూనికేషన్ కూడా పెరిగింది. తద్వారా పర్యాటకులను ఆకట్టుకుని సేవారంగంలో పురోగతి సాధించవచ్చు. తద్వారా ప్యాకేజీ పద్ధతిలో పర్యాటకులను ఆకర్షించవచ్చు.

భోలే బాబాను కఠినంగా శిక్షించాలి

జన విజ్ఞాన వేదిక డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్‌లో జరిగిన దారుణ సంఘటన పట్ల జన విజ్ఞాన వేదిక తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ ఘటనకు ప్రధాన కారకుడైన భోలే బాబాను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. మూఢ విశ్వాసాల నిరోధక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆదివారం విజయనగరం జిల్లా పరిషత్తు మినిస్టీరియల్ భవన్‌లో ఏర్పాటు చేసిన జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి ఎంవిఎన్ వెంకట్రావు, పి.రమణ ప్రభాత్ మాట్లాడుతూ తన పాద ధూళి మహిమగలదనే అశాస్త్రీయ, అభూత కల్పనలు ప్రజల్లో భోలే బాబా వ్యాప్తి చేశాడని తెలిపారు. ఈ నెల 2న జరిగిన తొక్కిసలాటలో దాదాపు 150 మందికి పైగా అమాయక ప్రజలు మృతి చెందారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విధమైన సంఘటనలు, మోసాలు దేశమంతటా ఏదో ఒక రూపంలో చోటుచేసుకుంటూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సామాన్యులను అజ్ఞానం, మూఢనమ్మకాలలోకి నెట్టి తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం బాబాలు, స్వామీజీలు.. రాజకీయ నాయకుల అండదండలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ఆశలు, భయాలు పెట్టుబడిగా మార్చుకొని ఆధ్యాత్మికత ముసుగులో అనేకమంది బాబాలు ప్రజల్ని తీవ్రంగా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి దుర్ఘటనలను అరికట్టకపోతే భవిష్యత్తులో ఈ విధమైన మూఢ విశ్వాసాల వల్ల యువత, మహిళలు, సాధారణ ప్రజలతోపాటు విద్యావంతులు సైతం ఆర్థికంగానూ, భౌతికంగానూ నష్టాల పాలవుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆర్టికల్ 51 (ఎ.హెచ్) ప్రకారం ప్రజలందరిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందింపజేసేందుకు తగిన కార్యాచరణ ప్రకటించాలని, మూఢ నమ్మకాల నిరోధక చట్టం చేసి పటిష్టంగా అమలుపరచాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారిలో దాదాపు అందరూ పేద మహిళలు, పిల్లలే ఉన్నారని విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకొని నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. పై సంఘటనకు కారణమైన భోలేబాబాను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని తీర్మానాన్ని జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఈ సమావేశంలో జెవివి జిల్లా సహాధ్యక్షులు కె.మురళీ బాబు, సమతా కన్వీనర్ జి.నిర్మల, సాంస్కృతిక విభాగం కన్వీనర్ వి. మోహనరావు, ఉపాధ్యక్షులు సత్య శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు డాక్టర్ చిన్నారి, కార్యదర్శి కె.శశిధర్, సభ్యులు సి హెచ్ సింహాచలం, ఎంజివి ప్రసాద్, వి.రాజగోపాల్ పాల్గొన్నారు.



సమావేశమైన జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు

ఘోషా ఆస్పత్రిపై నిర్లక్ష్యం

ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

గత వైసిపి ప్రభుత్వం ఘోషా ఆస్పత్రిపై నిర్లక్ష్యం వహించిందని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆరోపించారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఘోషా ఆస్పత్రిని పరిస్థితి చూస్తుంటే చాలా బాధ కలిగిందన్నారు. విద్యుత్తు, నీటి సమస్య పీడిస్తున్నాయని చెప్పారు. స్త్రీలకు ప్రసూతి సమయంలో శస్త్రచికిత్సలకు రక్తం అవసరమని, అటువంటి రక్తపు నిలువలు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్నిబట్టి అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. లాప్రోస్కోపిక్ మిషన్‌ను వినియోగంలోకి లేకుండా చేశారన్నారు. శస్త్రచికిత్స సమయంలో అవసరమయ్యే లైట్లు కేంద్ర ప్రభుత్వం ఇస్తే గత వైసిపి ప్రభుత్వం అమర్చలేక పోయిందని మండిపడ్డారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. వైసిపి ప్రభుత్వం భూ దందాలు, హత్యలు, విధ్వంసాలే తప్ప చేసిందేమీ లేదన్నారు. వ్యవస్థలను సరైన గాడిలో పెట్టాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, జొన్నవలస ఎంపిటిసి రాజేష్ బాబు, తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షులు బేగం, పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ పాల్గొన్నారు.



కోలాటాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే అదితి

రథయాత్ర ప్రారంభం

నగరంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. ఆదివారం దాసన్నపేటలో నిర్వహించిన రథయాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు చేశారు. రథయాత్ర సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాటం ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, విజయనగరంకోట

ఓపెన్ చెస్ టోర్నీకి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ది విజయనగరం చదరంగం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు విశేష స్పందన లభించింది. ఉడా కాలనీలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో 7, 9, 11, 13, 15, 17, 19 వయస్సు గల గ్రూపుల వారికి టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కమిటీ సభ్యులు ఎన్.బంగారుబాబు, ఈపు విజయ్ కుమార్, సన్నీ మాస్టర్, సముద్రాల గురుప్రసాద్, ఎస్‌విఎస్ రామకృష్ణ, ఆర్‌వి తిరుపతిరావు పోటీలను ప్రారంభించారు. చీఫ్ ఆర్బిటర్‌గా రవికుమార్ వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులను నడుపూరి రాంబాబు, నడుపూరి శ్రీను ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడలోని జోడుబందలు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గంట్యాడకు చెందిన హరీష్ (27) ఘటనా స్థలంలోనే మరణించాడు. మరోవ్యక్తి జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.



ఘటనా స్థలంలో మృతిచెందిన, గాయపడిన వ్యక్తులు

సకల సౌకర్యాలతో వసతిగృహాలు

- నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం
- 'ప్రజాశక్తి'తో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి రామానందం ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'జిల్లాలో ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల చదువుకు ఆటంకాలు లేకుండా చూస్తున్నా'మని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి బోని రామానందం తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు వసతి గృహాల ద్వారా అందించే సౌకర్యాలు, మెరుగైన విద్యను అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఎన్ని ఉన్నాయి? విద్యార్థులు ఎంతమంది.?

జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 30 ఉన్నాయి. అందులో ప్రీ మెట్రిక్-14, పోస్ట్ మెట్రిక్-16 వసతి గృహాలు ఉన్నాయి. ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లో 766 మంది, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో 1131 మంది విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లో 1400 మంది విద్యార్థులు విద్యను అభ్యసించడానికి కావల్సిన వసతి సౌకర్యాలు ఉన్నాయి. అందుకు అనుగుణంగా 14 వసతిగృహాల్లో ఈ ఏడాది 1000 మంది వరకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వసతిగృహాల సంక్షేమ అధికారులు గ్రామాలకు వెళ్లి విద్యార్థులను చేర్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. వసతిగృహాల్లో అందిస్తున్న మెనూ, సౌకర్యాల గురించి చెప్పి చేర్పించే ప్రక్రియ చేపట్టాం. కరపత్రాల ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

అద్దె భవనాల్లో ఎన్ని వసతిగృహాలున్నాయి.?

జిల్లాలో 30 వసతిగృహాలకు 23 ప్రభుత్వ భవనాలు, ఏడు అద్దె భవనాలు ఉన్నాయి. 6 ప్రభుత్వ భవనాల మరమ్మతుల కోసం రూ.6 లక్షలు కావాలని జెడ్‌పికి ప్రతిపాదనలు పంపాం. 16 ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులకు రూ.59.36 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం.



పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు పెంచేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి.?

పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో చేరేందుకు విద్యార్థుల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. మూతపడిన వసతిగృహాల్లో 15 వరకు పక్కా భవనాలు ఉన్నాయి, వాటిని పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలుగా మారిస్తే విద్యార్థులు చేరే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

మెస్‌ఛార్జీలు ఏ విధంగా అమల్లో ఉన్నాయి.?

వసతిగృహాల నిర్వహణకు 3, 4వ తరగతి విద్యార్థులకు మెస్‌ఛార్జీలు రూ.1150, 5 తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.1400, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు రూ.1600 ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పూర్తి స్థాయిలో పక్కాగా అమలవుతోంది.

దుప్పట్లు, పెట్టెలు, ఇతర సామగ్రి అందుతున్నాయా.?

ప్రతి విద్యార్థికి ప్రభుత్వం దుప్పటి, బెడ్ షీట్, ప్లేట్, గ్లాస్, బట్టలు పెట్టుకునేందుకు పెట్టే విద్యా సంవత్సరం ప్రారంభంలో అందిస్తాం. ఈ విద్యా సంవత్సరానికి కొద్ది రోజుల్లో అవన్నీ రానున్నాయి. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం. వీటితోపాటు నోట్ పుస్తకాలు, ప్రీ మెట్రిక్ విద్యార్థులకు జత యూనిఫాం అందుతాయి.



వసతిగృహాల్లో సౌకర్యాల మెరుగుదలకు చేపట్టిన చర్యలు ఏమిటి.?

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం మరి కొన్ని సౌకర్యాలు కల్పించింది. నీతి అయోగ్ నిధులతో వసతిగృహాల్లో 30 ఆర్ఒ ప్లాంట్లు, 78 సీలింగ్ ఫ్యాన్లు, 29 ఇన్వెర్టర్లు, 123 గోడ ఫ్యాన్లు, 100 మంచాలు సరఫరా చేశారు.

పదో తరగతి ఫలితాల మెరుగుదలకు చేపట్టిన చర్యలు.?

పదో తరగతిలో గతేడాది 98 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా చర్యలు చేపట్టాం. ఈ నెల ఒకటో తేదీ నుంచి అన్ని వసతిగృహాల్లో నలుగురు ట్యూటర్లను ఏర్పాటు చేసుకునేందుకు ఆదేశాలిచ్చాం. పక్కా ప్రణాళికలతో వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఇంటర్ పాఠ్యపుస్తకాలు అందేనా?

●ప్రతిపాదనలు పంపిన అధికారులు ● ఇంకా రాని పుస్తకాలు ●ఆందోళనలో ఇంటర్మీడియట్ విద్యార్థులు

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీపై గత వైసిపి ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఇంటర్ బోర్డు నుంచి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. ప్రతిపాదనలు కూడా జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు పంపించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందలేదు. ఇంటర్ విద్యామండలి నిధులతో పాఠ్య పుస్తకాలను విద్యా సంవత్సరం ప్రారంభంలో పంపిణీ చేయాల్సి ఉంది. పుస్తకాల ముద్రణపై స్పష్టత కొరవడడంతో పుస్తకాలు వస్తాయా రావా అనే సందేహంలో విద్యార్థులు ఉన్నారు. పుస్తకాలు లేకుండా తమ పిల్లలు ఎలా చదువుకో వాలని విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశ్నిస్తున్నారు. వేల రూపాయలు వెచ్చించి బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో 18 ప్రభుత్వ కళాశాలలు, కెజిబివి, మోడల్ స్కూళ్ల నుంచి సుమారుగా 29 వేల మందికి పైగా ఇంటర్ జూనియర్ విద్యార్థులు ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మరో 20 వేల మందిపైగా చదువు తున్నారు. ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయక పోవడంతో గతేడాది సీనియర్ల వద్ద సేకరించిన పుస్తకాలను జూనియర్లకు అందజేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పాత పుస్తకాల ద్వారానే విద్యార్థులు పాఠ్యాంశాలను అభ్యసిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎపిఆర్ఎ సి, కెజిబివి, ఎపి. మోడల్, సాంఘిక సంక్షేమ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలలో అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాల్సి ఉంది. జిల్లాల విభజన తర్వాత జూనియర్ కళాశాలలను (హైస్కూల్ ప్లస్) ఏర్పాటు చేశారు. అలా విజయనగరం జిల్లాలో మరో ఏడు కళాశాలలు ఏర్పడ్డాయి. వీటిలో చేరిన విద్యార్థులకు కూడా ఉచితంగా పుస్తకాలు అందించాల్సి ఉంది. దీనికితోడు జిల్లాలో ఇంటర్ బోర్డు గుర్తింపు ద్వారా నడుస్తున్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్, ప్రైవేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకూ పాఠ్యపుస్తకాలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడింది. పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు కలిపి విద్యార్థులకు సుమారు రూ. 2వేలు నుంచి 3 వేలకుపైగా ఖర్చవుతుంది.

ఇంటర్ విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

గత వైసిపి ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి యత్నిషి చేస్తున్నామంటూ చేసిన ప్రకటనలు నేతిబీర చందంగా మారాయి. విద్యా దీవెన, అమ్మ ఒడి పథకాల పేరుతో నగదు అందజేస్తున్నామంటూ ప్రచారం చేసుకుంంతీ. విద్యార్థుల అభ్యసనలో కీలకమైన పాఠ్యపుస్తకాలు అందజేయడంలో మాత్రం తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. గత అనుభవాల నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు నూతన ప్రభుత్వం చొరవ చూపించాల్సి ఉంది.

మధ్యాహ్న బోజన పథకం అమలేదీ?

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ప్రకటించడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమైంది. అయితే రెండు నెలలు అవుతున్నా ఇంత వరకు ఎటువంటి ఆదేశాలూ రాకపోవడంతో మధ్యాహ్న బోజన పథకం అమలు జరుగుతుందా లేదా అనేది సందిగ్ధంగానే ఉంది. మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి నిర్ణయం వస్తుందోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.



విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల

పాఠ్య పుస్తకాలు అందించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదు. వెంటనే పంపిణీ చేయాలి. పేద విద్యార్థులు వేల రూపాయలు పెట్టి ఎలా కొనగలరు.? పాఠ్య పుస్తకాలు లేకపోవడం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకంగా ఉంది. వెంటనే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి.

- డి.రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

ప్రతిపాదనలు పంపించాం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠ్యపుస్తకాలు , నోట్ పుస్తకాలు కోసం జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా మొదటి ఇంటర్‌లో విద్యార్థులు చేరుతున్నారు. వారి వివరాలు కూడా పంపిస్తాం. ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.

- ఎస్.భీమశంకరరావు, డివిఇఒ,విజయనగరం

శివారు భూములకు సాగునీరందేనా?

ప్రజాశక్తి-గుర్ల

ప్రభుత్వాలు మారినా రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. తోటపల్లి నీరు శివారు భూములకు ఈఏడాదైనా అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుర్ల మండలానికి సంభందించి ఏకైక సాగునీటి ప్రాజెక్టు గడిగెడ్డను 1965లో నిర్మించారు. అప్పటి గజపతినగరం నియోజకవర్గం ఎమ్మెల్యే గంట్ల సూర్యనారాయణ, పెనుమత్స సాంబశివ రాజు పట్టుదలతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా కుడి ఎడమ కాలువల నుంచి 2900 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కుడి కాలువ ద్వారా పకీరుకిత్తలి, బూర్లిపేట, పల్లిగండ్రేడు, గరికివలస, గజపతినగరం మండలం కెంగువ గ్రామాల పొలాలకు సాగునీరు అందుతుంది. ఎడమ కాలువ ద్వారా తెట్టంగి, గూడెం, పాలవలస, పున్నపురెడ్డి పేట, గోషాడ, కలవచర్ల గ్రామాలకు సాగునీరు అందించడానికి ఏర్పాటు చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన గోషాడ, కవచర్ల గ్రామాలకు గడిగెడ్డ సాగునీరు అందని ద్రాక్షలా మారింది. గడిగెడ్డ అభివృద్ధి పనుల్లో భాగంగా 2009 ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మంత్రి బొత్స సత్య నారాయణ గడిగెడ్డ కాలువల అభివృద్ధి, సిమెంట్ లైనింగ్ పనులకు రూ.16కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కుడి, ఎడమ కాలువలకు సగం వరకు పనులు చేసి వెళ్లిపోయారు. దీంతో ఆయకట్టు శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందడం లేదు. కుడి ఎడమ కాలువ కింద రైతులు కాలువ గట్టును జెసిబిల సాయంతో తవ్వేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. విషయం తెలిసిన గ్రామ, మండలస్థాయి నాయకులు కూడా నోరు మెదపడం లేదు. 2014 నుండి 2019 వరకు అధికారంలో టిడిపి ప్రభుత్వ హయాంలో మంత్రి కిమిడి మృణాళిని తోటపల్లి ప్రాజెక్ట్ నుండి గడిగెడ్డకు సాగునీరు అందించే కృషి చేసారు. 2016 నుండి 2018 వరకు తోటపల్లి నీరు వచ్చింది. గడిగెడ్డ అభివృద్ధి భాగంగా సర్‌ప్లస్ చప్టాపై నుంచి రహదారి సౌకర్యం కల్పించాలని పరిసర గ్రామస్తులు కోరడంతో తేలిక పాటి వాహనాలు వెళ్లేందుకు, గడిగెడ్డ నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు అప్పటి మంత్రి కిమిడి మృణాళిని రూ.13కోట్లు నిధులు కేటాయించారు. పనులు జరుగుతున్న సమయంలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి రివర్స్ టెండరింగ్ చేపట్టింది. దీంతో గడిగెడ్డ అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి. గడిగెడ్డ అభిద్ధి వృద్ధిపై సవతి తల్లి ప్రేమ కనబరుస్తూ న్నారని గడిగెడ్డ ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇప్పుడు అధికారం లోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం గడిగెడ్డ అభివృద్ధికి ఏ మేరకు కృషి చేస్తారో వేచి చూడాల్సిందే.


ప్రాజెక్టు గట్టును తవ్వి కబ్జా చేస్తున్న అక్రమార్కులు


మధ్యలో నిలిచిపోయిన చప్టా అభివృద్ధి పనులు

వంతెన కింద ఖాళీ చేయండి

● కాయగూరల రైతులకు పోలీసుల ఆదేశం ● తరచూ ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో చర్యలు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి జంక్షను వద్ద బ్రిడ్జి కింద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న కాయగూరల రైతులను ఖాళీ చేయాలని పోలీసులు ఆదేశించారు. దీంతో వారంతా నాయకులను ఆశ్రయించారు. మరో చోట స్థలం చూశాక ఖాళీ చేసేందుకు నిర్ణయించారు. ఈ వంతెన కింద ఉన్న ఫుట్‌పాత్‌లపై కాయగూరల వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాని ఫుట్‌పాత్‌తో పాటు రాకపోకలు చేసే రహదారిపై కూడా బుట్టలు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. కొనుగోలు దారులు కూడా వాహనాలను బయట పార్కింగ్ చేయకుండా వ్యాపారుల వద్ద ఆపి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రాకపోకలు చేసే వాహనాలకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ వంతెనలో నుంచి పాఠశాల బస్సులు, క్వారీ వాహనాలు, ట్రాక్టర్లు, ఓ కాలేజీకి సంబంధించిన బస్సులు ఎక్కువగా రాకపోకలు చేస్తుంటాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కూడా ఈ వంతెన కింద నుంచి వెళ్ళాలి. దీంతో ట్రాఫిక్ తీవ్రంగా పెరిగిపోవడంతో ఈ కాయగూరల వ్యాపారాలే దీనికి కారణమని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు సి.ఐ రవికుమార్ ఆదివారం ఉదయం వారందరిని పిలిపించి ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేస్తే తీవ్రంగా నష్టపోతామని వారు తెలిపారు. అనంతరం వీరంతా ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్ళినట్లు తెలిసింది. అయితే వీరికి కొత్త స్థలం చూడాలని ఎంపిడిఒకు ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలిసింది. అంతవరకు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇక్కడ సర్వీసు రహదారిలో రోడ్డుపైనే ఉన్న చేపల మార్కెట్‌ను ఫుట్‌పాత్‌పైకి ఎక్కించారు. దీనిపై సీఐ మాట్లాడుతూ ఈ వంతెన కింద తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అందుకనే కాయగూరల వ్యాపారులను ఖాళీ చేయాలని సూచించాం. చేపల మార్కెట్‌ను పైకి తరలించామని చెప్పారు. ఆటోలను కూడా వంతెనకు ఎదురుగా పెట్టడం వల్ల కింద నుంచి వాహనాలు మలుపు తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నాయని ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు.


వంతెన కింద కూరగాయలు అమ్ముతున్న రైతులు

జంక్షన్‌ను పరిశీలించిన ఎమ్‌పి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై సవరవల్లి జంక్షన్ వద్ద అండర్ పాస్ నిర్మాణానికి ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు అ జంక్షన్‌ను ఆదివారం పరిశీలించారు. జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించినప్పుడు సవరవల్లి జంక్షన్ వద్ద వంతెన నిర్మించలేదు. ప్రతి సోమవారం ఇక్కడ వారపు సంత జరుగుతుంది. ఈ నేపథ్యంలో అటు ఇటు రాకపోకలు చేసేవారు ప్రమాదాల భారిన పడుతున్నారు. దీనిపై వివిధ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే లోకం మాధవి, తెదేపా నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు దృష్టికి తీసుకెళ్లడంతో అండర్ పాస్ నిర్మించాలని వారు ఎమ్‌పికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన అక్కడ పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలతో పాటు తెదేపా నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు, మాజీ సర్పంచ్ ఇమంది కూర్మారావు, మండల తెదేపా అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కాకర్లపూడి శ్రీనివాసరాజు, సూర్యనారాయణ రాజు ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్‌పికి, ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్‌పి మాట్లాడుతూ ఇక్కడ అండర్ పాస్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ మధ్య పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్నందున సంబంధిత మంత్రితోపాటు అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ పేరాపురం, మోదవలస గ్రామాల వద్ద ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, కోరాడ తాతారావు, రీసు రమణ, బొల్లు త్రినాథ్, మాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్‌పికి సమస్యను వివరిస్తున్న కర్రోతు

నేరాలు ఘోరాలు

మృతుడి ఆచూకీ లభ్యం

భోగాపురం: మండలంలోని దిబ్బలపాలెం సమీపంలోని తోటల్లో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకిని మృతుడి జేబులో లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మధురై జిల్లాకి చెందిన రూప్ చందు (28)గా గుర్తించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనుల్లో భాగంగా కొంతమంది కుటుంబ సభ్యులతో ఇక్కడికి వచ్చాడు. డ్రైవర్‌గా పనిచేస్తున్న రూప్ చందు గత సోమవారం నుంచి కనబడలేదు. దీంతో ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని అనుకున్నారు. కానీ అప్పుడే చెట్టుకు ఉరేసుకొని చనిపోవడంతో గుర్తించలేకపోయారు. శనివారం కొంతమంది వ్యక్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన జేబులో లభించిన సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేట గ్రామానికి చెందిన బాలిక నెత్తి సంధ్య (17) ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటర్, డిప్లమా పూర్తి చేసిన సంధ్య ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని ఎస్.కోట సిహెచ్‌సికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న కారు..ఒకరికి గాయాలు

రామభద్రపురం: జాతీయ రహదారిపై ఆరికతోట రైస్ మిల్లు వద్ద వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. ఆరికతోటకు చెందిన పొట్నూరు ప్రకాశరావు తన ఆటోలో రామభద్రపురం నుంచి వస్తూ రైస్ మిల్లు వద్ద కుడివైపు వెళ్ళే క్రమంలో ఆటో వేగం తగ్గించాడు. దీంతో వెనుక నుంచి అదే మార్గంలో వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఆటో నుజ్జు నుజ్జు అయ్యి ప్రకాశరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని బాడంగి సిహెచ్‌సికి తరలించారు.

కాలంరాజుపేటలో విష జ్వరాలు


● చికిత్స పొందుతూ భార్య మృతి
● ఆస్పత్రిలో భర్త..

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని శివారు గ్రామమైన పూలువలస గ్రామ పంచాయతీ మధుర గ్రామం కాలం రాజుపేట గ్రామంలో విష జ్వరాలు విలయ తాండవం చేస్తున్నాయి. దీంతో అనేక మంది మంచాన పడ్డారు. గ్రామంలో ప్రతి ఇంటిలోనూ జ్వరపీడుతులున్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్లేట్లెట్స్ డౌన్ అయిపోయి ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి చర్యలు చేపట్టక పోవడం వల్ల చాలా మంది రాజాం కేర్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేసుకుని చేతి చమురు వదుల్చు కుంటున్నారు.

చికిత్స పొందుతూ అప్పమ్మ మృతి

నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ శనివారం ఆస్పత్రికి వెళ్లిన గ్రామానికి చెందిన పిల్లల అప్పమ్మ (50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె భర్త అసిరియ్య కూడా రాజాం కేర్ ఆస్పత్రిలోనే జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. మృతురాలి అప్పమ్మకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇందులో ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిల్లు కాగా, వివాహం జరగాల్సిన కుమారుడు ఉన్నాడు. గ్రామంలో ఏ ఇంట్లో చూసినా జ్వర పీడుతులే దర్శనమిస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


జ్వరంతో బాధపడుతున్న అసిరియ్య

గ్రామంలో అపారిశుధ్యం

గ్రామంలో అపారిశుధ్యం తాండవిస్తుంది. దీంతోనే జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి పెరుమాలి పిహెచ్‌సి పరిధిలో ఉన్న ఈ గ్రామంలో జ్వరపీడుతు లున్నారని తెలిసినా వైద్య సిబ్బంది అటుగా కన్నెత్తి చూడలేదు. దీంతో జ్వరపీడుతుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. డబ్బులున్న వారు రాజాం వంటి ప్రాంతాలకు వెళ్లి ప్రయివేటు ఆస్పత్రిల్లో వైద్యం చేయించుకుంటుండగా పేద వారు ఊళ్లోనే మగ్గిపోతున్నారు. దీనిపై పెరుమాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వెంకటేష్‌ను వివరణ కోరగా ఎప్పటికప్పుడు మెడికల్ క్యాంపులు పెడుతున్నామని చెప్పారు. సర్పంచ్ రమణమూర్తి, గ్రామపంచాయతీ కార్యదర్శి మధు పారిశుధ్య పనులు చేయించి కాలువలు, తాగునీటి బావుల్లో బ్లీచింగ్ వేయించామని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

108 సిబ్బంది నిర్లక్ష్యం

ప్రజాశక్తి- బాడంగి

ఎరుకులపాకలు గ్రామానికి చెందిన రొంగళి దీపిక కడుపునొప్పి తాళలేక బాడంగి పిహెచ్‌సిలో ఆదివారం చేరారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు అంబులెన్స్ ద్వారా విజయనగరం ఆస్పత్రికి తరలించాలని రిఫర్ చేశారు. ఈ నేపథ్యంలో ఆమెను విజయనగరం తరలిస్తుండగా ఎరుకుల పాకలు గ్రామం వద్ద అంబులెన్స్ ఆగింది. పేషెంట్‌కి సంబంధించిన తల్లిదండ్రులతో పాటు పేషెంట్‌కి సహాయం నిమిత్తం మరొక ఆమె కూడా అంబులెన్స్ ఎక్కింది. దీంతో అంబులెన్స్ సిబ్బంది ఆమె దిగిపోవాలని లేకుంటే రోగిని ఇక్కడ నుంచి తరలించబోమని, చనిపోయినా తమకు సంబంధం లేదని 108 వాహనాన్ని ముందుకు వెళ్లనీయకుండా రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఒకపక్క రోగి కడుపు నొప్పితో అల్లాడిపోయి ఏడుస్తుంటే మరో పక్క అంబులెన్స్ సిబ్బంది అవహేళనగా ఈ పాపకి ఏ నొప్పి లేదు, ఊరకనే నటిస్తుందని మాట్లాడటం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానికులతో వారిస్తూ తమదీ రామభద్రపురమేనని, అక్కడికి వస్తే మీ సంగతి చూస్తానని సిబ్బంది గ్రామస్తులను బెదిరించడం చర్చనీయాంశమైంది. తాము ఎరుకుల వాళ్లమని తమను చిన్నచూపు చూసి తమను 108 సిబ్బంది బెదిరించి తిట్టారని గిరిజనులు వాపోతున్నారు. ఎరుకుల కులంలో పుడితే మావి ప్రాణాలు కావా? మా పట్ల ఇంకా ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని విధుల నుంచి తప్పించకపోతే ఆస్పత్రి వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని ఎంపిటిసి పాలవలస గౌరు హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బొబ్బిలి: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ బెల్ట్ సొసైటీ, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఓటిపి ఛాలెంజ్‌ను స్వీకరించి మొక్క నాటినట్లు చెప్పారు. నాఛాలెంజ్‌ను స్వీకరించి ఒకొక్కరు మూడు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమన్నారు. మొక్కలు నాటేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, సభ్యులు కె.కృష్ణదాస్, సభ్యులు పాల్గొన్నారు.


మొక్కనాటుతున్న ఎమ్మెల్యే బేబినాయన

బేబినాయనను సత్కరించిన మెగా అభిమానులు

ఎమ్మెల్యే బేబినాయనను మెగా అభిమానులు కలిసి సత్కరించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన బేబినాయనను మొదటిసారిగా మెగా అభిమానులు ఆదివారం కోటలో కలిశారు. బేబినాయన విజయం ఎంతో సంతోషాన్ని కలిగించిందని మెగా అభిమాన సంఘం అధ్యక్షులు లంక రమేష్, సభ్యులు బోను శ్రీను, నాగు, తదితరులు అన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

బొబ్బిలి: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బొబ్బిలి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ గేదెల శశిభూషణరావు, బి.మేరిజాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఎన్నికల అధికారి చింతల వెంకట సతీష్ ఆధ్వర్యంలో ఎన్నిక జరగ్గా అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రభుత్వ వైద్యులు శశిభూషణరావు, బిసి బాలికల వసతి గృహ అధికారి మేరీజాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా బి.అరుణభారతి, సహధ్యక్షులుగా ఇవి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యు.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జి.సుజాత, జి.నాగ రత్నం, పైడితల్లి, ప్రభాకర్, రామదీపిక, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సురేష్, కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు.


శశిభూషణరావు, మేరిజాయ్

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

కొత్తవలస: మండల కేంద్రంలోని తుమికాపల్లి గ్రామంలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ్ హరికుమార్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దెందేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సునీత, ప్రసాద్ దంపతులు, పీడీ కృష్ణంరాజు, ఎన్.ఎస్ శ్రీనివాసరావు, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫర్ ద పీపుల్ సేవలు అభినందనీయమని, మా విద్యార్థులు సేకరించిన డబ్బులు ఇలాంటి ఒంటరి వృద్ధులకు చేరడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సహాయ సహకారాలు అందించిన విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ హరికుమార్, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, వియ్యం పేట పిహెచ్‌సి సూపర్‌వైజర్, ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యుల గోవిందరావు, నగేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస పంచాయతీ ఇఒగా రత్నం

కొత్తవలస: కొత్తవలస గ్రామ పంచాయతీ ఇఒగా వైఎస్ఎన్ రత్నం నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారుని ఎల్. కోటలోతన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. అనంతరం కొత్తవలస పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి, స్థానికుల నాయకులు ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. తన మీద నమ్మకంతో గురుతర బాధ్యతలు పెట్టిన నాయకులకు కృతజ్ఞత తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఇఒ సిహెచ్ కన్నబాబు విజయనగరం జిల్లా రాజాం మండలం పొగరికి బదిలీ అయింది. పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది ఆమెకు పుష్ప గుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు.

ఉత్తమ వైద్య సేవలకు సత్కారం

బొబ్బిలి: మాతృ భూమిపై మమకారంతో బొబ్బిలి, పార్వతీపురంలో గుండె వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ గుండె వైద్య నిపుణులు గుల్ల సూర్యప్రకాష్‌ను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. చైతన్య మెడికల్ ల్యాబ్‌లో ఆదివారం రోటరీ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, ఎకానమీ, కమ్యూనిటీ చైర్ వారాణసి శ్రీహరి, యు.శంకరరావు సత్కరించారు. వైద్యులు సూర్యప్రకాష్ సేవలను కొనియాడారు. మాతృభూమిపై మమకారంతో బొబ్బిలి, పార్వతీపురంలో వైద్య సేవలు అందించి అనేకమందిని గుండె వ్యాధులు నుంచి కాపాడారన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు కె.రామకృష్ణ, కె.నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం

పూసపాటిరేగ: మండలంలోని కోనాడలో అధికార పార్టీ కార్యకర్తలు గ్రామం నడిబొడ్డున ఉన్న వైఎస్ఆర్ విగ్రహన్ని శనివారం రాత్రి ధ్వంసం చేశారని సర్పంచ్ బొడ్డు ఎల్లాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి సమయంలో విగ్రహంపై దాడి చేసి చేతిని విరగగొట్టారని ఆదివారం ఉదయం విగ్రహం పై దాడి జరిగిందన్న విషయం తెలుసుకుని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహం సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను స్వాధీన పరుచుకున్నారు. కేసు నమోదు చేసి అరాచక శక్తులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

అర్ధ సైనిక్ బోర్డు ఏర్పాటు చేయాలి

బొబ్బిలి: పారా మిలటరీ జవాన్లకు అర్ధ సైనిక్ బోర్డు ఏర్పాటు చేయాలని పారా మిలటరీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం కోరారు. అర్ధ సైనిక్ బోర్డు ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఆదివారం కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మీ ఉద్యోగులకు ఇస్తున్న సౌకర్యాలు పారా మిలటరీ జవాన్లకు కల్పించేందుకు అర్ధ సైనిక్ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు 2012లో ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడం లేదన్నారు. దేశ సరిహద్దులో విధులు నిర్వహించి ప్రాణాలు కోల్పోతున్న జవాన్లకు పెన్షన్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాలు, ఇళ్ల నిర్మాణాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో అర్ధ సైనిక్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న రవికిరణ్

అవుట్ సోర్సింగ్ రాష్ట్ర ట్రెజరర్‌గా రవికిరణ్

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న రవికిరణ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ స్టేట్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం రాష్ట్ర వెల్ఫేర్ అవుట్ సోర్సింగ్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ యూనియన్‌కు ట్రెజరర్‌గా రవి కిరణ్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ బాధ్యతలు తీసుకున్న రాష్ట్ర గురుకుల అవుట్ సోర్సింగ్ కార్యవర్గ సభ్యులందరూ సంఘ పరంగా ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనంపై పిల్లలకు ఆయ అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలతో కథల పుస్తకాలు, పురాణ, ఇతిహాస గ్రంథాలు గురించి వివరించారు. చిల్డ్రన్స్‌క్లబ్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

కారాడ వద్ద దారిదోపిడీ

బొబ్బిలి: కారాడకు చెందిన పార్వతి ఆదివారం సాయంత్రం కన్నవారి ఇంటి నుంచి అత్తవారింటికి నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు దారిదోపిడి చేశారు. వెనక నుంచి వచ్చి రాయితో మొహం పై కొట్టి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారం తాడు, చెవిలోని దిద్దులు దొంగలించి పారిపోయారు.